క్లుప్తంగా

సేవా కార్యక్రమాలకు సహకరించాలి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు రేఖ

అర్వపల్లి : రేఖ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలకు ప్రభుత్వ పరంగా సహకారం అందించాలని ఆ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, జాతీయ టెన్నిస్ క్రీడాకారిణి డాక్టర్ బోయలపల్లి రేఖ శనివారం కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌ను కలిసి కోరారు. నూతన కలెక్టర్‌గా నియమితులైన పవార్‌కు కలెక్టరేట్‌లో పుష్పగుచ్ఛం అందజేశారు. రేఖ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు కలెక్టర్‌కు వివరించారు. తాను జాతీయ స్థాయి క్రీడాకారిణి అయినందున క్రీడల అభివృద్ధికి కూడా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కృషిచేస్తున్నట్లు చెప్పారు.

జూలై 3న గరికపాటి నర్సింహారావు ప్రవచనం

సూర్యాపేట : మహా సహస్రావధాని, ప్రవచన కర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి గరికపాటి నర్సింహారావు ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమాన్ని జూలై 3న పట్టణంలోని రవి మహల్ ఫంక్షన్ హాల్‌లో సాయంత్రం 5గంటల నుంచి 8గంటల వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు బొమ్మిడి అశోక్ తెలిపారు. శనివారం సూర్యాపేట పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆధ్యాత్మిక వేత్తలు, పట్టణ ప్రముఖులు, సాహిత్య అభిలాషులు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో తూముల ప్రవీణ్, నూకల శైలేందర్, బొడ్డు శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చైర్లు, మైక్‌సెట్ అందజేత



చైర్లు, మైక్‌సెట్ అందజేస్తున్న దాతలు

నూతనకల్ : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శివయ్య అన్నారు. అలుగునూరు ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ కొడేటి ప్రదీప్‌గౌడ్, మండల కాంగ్రెస్ నాయకుడు బంటు బద్రి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బంటు క్రాంతికుమార్‌లు రూ. 20వేల వ్యయంతో 10చైర్‌లు, మైక్ సెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉప్పు నాగయ్య, రుద్రం మహేందర్, సరిత, సీఆర్పీ రవీందర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారుల సంఘం ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

అర్వపల్లి : మండల పరిధిలోని కాసర్లపహాడ్‌లో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా మాచర్ల మల్లయ్య ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పర్వత మల్సూరు, కంపసాటి సత్తయ్య, మాదగాని యాదగిరి, గైగుళ్ల వెంకన్న, ఉయ్యాల యాదగిరి, ఉప్పుల అర్జయ్య, మచ్చ సైదులు, గుడిపాటి కిష్టయ్య, వేముల గోపమ్మ, చెరుకు భిక్షం, కంపసాటి వీరయ్య, పాడి రైతులు పాల్గొన్నారు. కాగా ఈ ఎన్నికను తుంగతుర్తి పాలశీతలీకరణ కేంద్రం సూపర్‌వైజర్ యల్లయ్య నిర్వహించారు.

ప్రైవేట్ పాఠశాలలో విక్రయిస్తున్న పుస్తకాల సీజ్

తిరుమలగిరి : తిరుమలగిరి మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో అధిక ఫీజులు వసూలు చేసే విద్యార్థులకు పుస్తకాలు విక్రయిస్తున్నారని ఫిర్యాదు అందడంతో శనివారం మండల విద్యాధికారి ఐ.శాంతయ్య ఆదేశాల మేరకు తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ ఆ పాఠశాలలోని పుస్తకాల గదిని సీజ్ చేశాడు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్నారని, పాఠశాలలో పుస్తకాలు విక్రయిస్తున్నారని ఫిర్యాదు అందడంతో తనిఖీలు నిర్వహించి సీజ్ చేసినట్లు చెప్పారు. ఆయన వెంట ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కందుకూరి అంబేద్కర్ తదితరులు ఉన్నారు.



పుస్తకాల గదిని సీజ్ చేస్తున్న హెచ్‌ఎం

రైతులకు అందని సహకారం

- పీఏసీఎస్‌లలో పత్తాలేని సబ్సిడీ ఎరువులు, విత్తనాలు
- పంట రుణాలు, ధాన్యం కొనుగోలుకే పరిమితం
- ఆర్థిక భారంతో ఇబ్బందులు పడుతున్న రైతులు



అనంతారం పీఏసీఎస్ కార్యాలయం

పెన్‌పహాడ్ : రైతులకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)లను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా రైతులకు సాగులో నూతన పద్ధతులను తెలియజేస్తారు. అవసరమైన యంత్ర పరికరాలు, విత్తనాలు, ఎరువులను సబ్సిడీపై అందిస్తారు. అయితే గత నాలుగేళ్ల నుంచి సబ్సిడీ విత్తనాలు, ఎరువులు సరఫరా కావడం లేదు. దీంతో అన్నదాతలు విత్తన దుకాణాలు, బహిరంగ మార్కెట్‌లపై ఆధారపడాల్సి వస్తోంది. ఇదే అదునుగా భావించిన కొంత మంది అక్రమార్కులు రైతులకు నకిలీ విత్తనాలు అంటగడుతున్నారు. ఫలితంగా పీఏసీఎస్‌ల ద్వారా వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి రైతులను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

అందని సేవలు.. రైతులకు ఇబ్బందులు

రైతులకు పంట ఉత్పత్తులను విక్రయిస్తే వచ్చే ఆదాయం కంటే సాగు ఖర్చులే అధికంగా ఉంటున్నాయి. దీంతో రైతులు ఏటా అప్పుల పాలవుతున్నారు. అయితే సహకార సంఘాలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులతో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సి ఉండగా ప్రస్తుతం అవేమీ కనిపించడం లేదు. పంట మార్పిడి, సేంద్రియ సాగు, అధిక దిగుబడులు ఇచ్చే వంగడాలపై రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వడంలేదు. సాగుకు సంబంధించి రైతులకు సబ్సిడీపై యంత్ర పరికరాలను సరఫరా చేసేవారు. కానీ కొన్నేళ్లుగా ఈ ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో రైతులకు పంటల సాగు భారంగా మారుతోంది.

వానాకాలం సాగు పనులు ప్రారంభమైనా..

వానాకాలం సాగు పనులు ప్రారంభమైనా సబ్సిడీ విత్తనాలు అందకపోవడంతో రైతులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. మండల పరిధిలోని చీదెళ్ల సహకార సంఘంలో 1820 మంది రైతులు, నారాయణగూడెం సహకార సంఘం పరిధిలో 2850 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. పంట రుణాలు, ధాన్యం కొనుగోలుకే పీఏసీఎస్ సేవలు పరిమితమయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వ్యాపారుల దోపిడీ..

సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అందుబాటులో లేకపోవడంతో వ్యాపారులు యూరియా, డీఏపీలను అధిక రేట్లకు విక్రయిస్తున్నారు. సబ్సిడీ ద్వారా ఒక యూరియా బస్తా రూ. 285 ఉండగా, ప్రైవేట్‌లో దాదాపు రూ. 350 చెల్లించాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సబ్సిడీ విత్తనాలు ఇవ్వాలి

సహకార సంఘం ద్వారా గతంలో యూరియా, డీఏపీతో పాటు కంది, పత్తి విత్తనాలు రాయితీపై అందించేవారు. కానీ గత నాలుగేళ్లుగా ఇవ్వడం లేదు. ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలు సరఫరా చేసి రైతులను ఆర్థికంగా ఆదుకోవాలి.

– లక్ష్మయ్య, రైతు, అనంతారం

పీసీ మహలనోబిస్ సేవలు స్ఫూర్తిదాయకం



మహలనోబిస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, అధికారులు

భానుపురి : 1946లో ఐక్యరాజ్య సమితి గణాంక శాస్త్ర కమిషన్ సభ్యుడిగా పనిచేసిన పీసీ మహలనోబిస్ సేవలు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో మహలనోబిస్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మహలనోబిస్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. పీసీ మహలనోబిస్ కేంద్ర మంత్రివర్గ గణాంక శాస్త్ర గౌరవ సలహాదారుడిగా, నేషనల్ సర్వే శాంపిల్ విభాగంలో పనిచేశారని అన్నారు. ప్రణాళిక సంఘం సభ్యుడిగా తన సేవలందించారని కొనియాడారు. అనంతరం డిస్ట్రిక్ట్ హ్యాండ్ బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్ 2022–23 పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి ఎల్.కిషన్, గణాంక అధికారి శ్రీనివాసరావు, ఏఓ సుదర్శన్‌రెడ్డి, లెక్చరర్ చింత లింగం, టీఎన్‌జీవోస్ జిల్లా కార్యదర్శి దున్నా శ్యాం, ఉప గణాంకాధికారులు ఎ.కిషన్, ఎం.రాజేష్, బాదె లింగయ్య, లోక్య, రామారావు, కోటేశ్వర్‌రావు, శివలింగప్రసాద్, బాలాజీ, నరేందర్, అశోక్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుట్టు శిక్షణతో మహిళలకు స్వయం ఉపాధి



శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న గండూరి కృపాకర్

సూర్యాపేట : కుట్టు శిక్షణతో మహిళలు స్వయం ఉపాధి పొందవచ్చని లయన్స్ క్లబ్ రీజనల్ చైర్‌పర్సన్, జిల్లా బీఆర్ఎస్ నాయకుడు గండూరి కృపాకర్, లయన్స్ క్లబ్ ఆఫ్ స్ఫూర్తి అధ్యక్షుడు బీరవోలు హైమావతి అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ స్ఫూర్తి ఆధ్వర్యంలో విద్యానగర్‌లో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు శనివారం సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. లయన్స్ క్లబ్ ఆఫ్ స్ఫూర్తి చార్టర్ ప్రెసిడెంట్ ఇరిగి కోటేశ్వరి ఆధ్వర్యంలో ఈ కుట్టు శిక్షణ నిర్వహించినట్లు తెలిపారు. మొత్తం మూడు విడుతలుగా అందించిన ఈ శిక్షణలో 120మంది మహిళలు శిక్షణ పొందారని అన్నారు. ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలను మహిళలు సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ స్ఫూర్తి సెక్రటరి వెన్న కవిత, ట్రెజరర్ ధాకా విజయలక్ష్మి, లయన్స్ క్లబ్ ఆఫ్ సూర్యాపేట సెక్రటరి వెంపటి శభరినాథ్, మందడి రమాదేవి, కేతిరెడ్డి పద్మ, కొప్పు సందీప్, ముదులగర్ కళ్యాణ్, ఎండి ఇస్మాయిల్, అనిల్, శిక్షకురాలు రేణుక పాల్గొన్నారు.

పోలీసుశాఖలో సేవలు అభినందనీయం



ఏఎస్‌ఐ దంపతులను సన్మానిస్తున్న ఏఎస్పీ

సూర్యాపేటటౌన్ : సుదీర్ఘకాలం పోలీసు శాఖలో ప్రజలకు సేవలు అందించడం అభినందనీయమని ఏఎస్పీ ఎం.నాగేశ్వర్‌రావు అన్నారు. మునగాల పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన నాగేశ్వర్‌రావు దంపతులను ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా వారికి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్మ్‌డ్ అదనపు ఎస్పీ జనార్దన్‌రెడ్డి, ఏఓ మంజుభార్గవి, పోలీస్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామచందర్ గౌడ్, సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీకాంత్, సభ్యులు అంజన్ రెడ్డి, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

నూతనకల్ : మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సునీత తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే మందుల సామేల్ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. సర్వసభ్య సమావేశానికి అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు. అనంతరం ప్రజాప్రతినిధులకు సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

మీ సేవ కేంద్రం మంజూరు

అర్వపల్లి : మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామానికి మీ సేవ కేంద్రం మంజూరైనట్లు సెర్ప్ ఏపీఎం వలిశెట్టి మల్లేష్ తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడారు. దరఖాస్తుదారులు మహిళా సంఘంలో సభ్యురాలై ఉండి ఇంటర్మీడియట్, పీజీడీసీఏ పూర్తిచేసి ఉండాలని తెలిపారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు పీఏసీఎస్ సమావేశం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని తిమ్మాపురం పీఏసీఎస్ కార్యాలయంలో ఆదివారం ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు సంఘం చైర్మన్ మారిపెద్ది మంగమ్మ, సీఈఓ ఊర సత్యనారాయణ శనివారం తెలిపారు. రైతులు, సంఘం సభ్యులు హాజరు కావాలని కోరారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలపై అవగాహన



అనంతారం మోడల్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది



తొండ గ్రామంలో గ్రామసభలో పాల్గొన్న అధికారులు, గ్రామస్తులు

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని అనంతారం మోడల్ పాఠశాలలో వైద్యశాఖ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీహెచ్ఓ బిచ్చునాయక్ మాట్లాడారు. వర్షా కాలంలో ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు వ్యాప్తి చెందుతాయని తెలిపారు. దోమల వల్ల మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వస్తాయని అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అందరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. వేడి వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నజియా, ప్రిన్సిపాల్ బాలరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వర్షా కాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల పంచాయతీ అధికారి మారయ్య అన్నారు. శనివారం తొండ గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలందరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి యాకూబ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

జూలై 4న కొమురయ్య వర్ధంతి సభ



మాట్లాడుతున్న ఎర్ర అఖిల్‌కుమార్

తిరుమలగిరి : జూలై 4న తుంగతుర్తిలో నిర్వహించే దొడ్డి కొమురయ్య వర్ధంతి సభను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ తుంగతుర్తి డివిజన్ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్ కోరారు. శనివారం తిరుమలగిరిలో ఆయన మాట్లాడారు. నాటి నిజాం పాలనలో హింసలకు, పంటల దోపిడీలకు వ్యతిరేకంగా జరిపిన పోరాటాలకు దొడ్డి కొమురయ్య నాయకత్వం వహించాడని అన్నారు. కొమురయ్య స్ఫూర్తితో యువత, ప్రజలు చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. జూలై 4న జరిగే బహిరంగ సభకు రాష్ట్ర కార్యదర్శి పోర్టు రంగారావు, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పేర్ల నాగయ్య, కందుకూరి కొండయ్య, సురేష్, స్వలింగం, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డు ఉపాధ్యాయులకు సన్మానం



చివ్వెంల : ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న సహ ఉపాధ్యాయులు, విద్యార్థులు

చివ్వెంల : ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని మండల కాంప్లెక్స్ హెచ్‌ఎం కళారాణి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం తీకుళ్ల సాయిరెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా సాయిరెడ్డి దంపతులను పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఉద్యోగ విరమణ పొందుతున్న సాయిరెడ్డి విద్యార్థులకు పెన్నులు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జూలకంటి సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, క్రిష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందుతున్న పీడీ హన్మంతరావుకు సన్మానం..

నూతనకల్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్, ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తూ ఉద్యోగ విరమణ పొందిన తూము హన్మంతరావు సన్మాన సభను శనివారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ భూరెడ్డి కళావతిసంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హన్మంతరావు 42 సంవత్సరాలుగా ఎంతో మంది విద్యార్థులను జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దారని ఆమె తెలిపారు. ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారని, ఆయన సేవలను విద్యార్థులు ఎల్లప్పుడు గుర్తుంచుకుంటారని అన్నారు. అనంతరం తూము హన్మంతరావు–పుష్పలత దంపతులను అధికారులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధ, ఎంపీటీసీ పన్నాల రమమల్లారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు..

తుంగతుర్తి : కష్టపడే వారికి సమాజంలో ఎప్పటికీ గుర్తింపు లభిస్తుందని ఎంఈఓ బోయిని లింగయ్య అన్నారు. శనివారం బండరామారం జెడ్పీహెచ్ఎస్‌లో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉద్యోగులకు బదిలీలు సహజమని అన్నారు. కానీ వెళ్లిన చోట మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. అనంతరం బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను విద్యార్థులు, గ్రామస్తులు పూలమాలలతో, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చంద్రు నాయక్, ఉపాధ్యాయులు వెంకన్న, హైమద్, గ్రామస్తులు ఆకారపు ముత్తిలింగం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దాతల చేయూత..

విద్యార్థులకు చేయూత అందించేందుకు దాతలు ముందుకురావడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు చంద్రు నాయక్ అన్నారు. మాజీ ఎంపీపీ తాడికొండ సీతయ్య విద్యార్థులకు మధ్యాహ్న భోజనం చేయడం కోసం ప్లేట్లు, గ్లాసులు అందించారని తెలిపారు. అలాగే గ్రామపెద్ద ఉప్పునూతల జయ చంద్రారెడ్డి పాఠశాలకు బెంచీలు, కుర్చీలు సమకూర్చుతానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.



బండరామారంలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయురాలును సన్మానిస్తున్న గ్రామస్తులు



నూతనకల్ : హన్మంతరావు దంపతులను సన్మానిస్తున్న ఎంపీపీ, ప్రజాప్రతినిధులు

బొగ్గు గనుల వేలం ఆపాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

భానుపురి : బొగ్గు గనుల వేలం పాట ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని మంచిర్యాల జిల్లా శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం వేలం వేస్తోందని అన్నారు. దీంతో రానున్న రోజుల్లో సింగరేణి సంస్థ ప్రైవేటు పరం కానుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొలిశెట్టి యాదగిరి, వెంకటేశ్వర్‌రావు, గోపి, నరసింహారావు, వెంకన్న, శేఖర్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు వేతనాలు పెంచాలి

పెన్‌పహాడ్ : అంగన్‌వాడీ టీచర్లకు అదనపు పని భారం తగ్గించాలని, కనీస వేతనం రూ. 21 వేలకు పెంచాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. అదనపు పని భారంతో అంగన్‌వాడీ టీచర్లు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకోలేక దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని తెలిపారు.

పాఠశాల అభివృద్ధికి నిధులు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ వీరప్రసాద్‌యాదవ్

అర్వపల్లి : అర్వపల్లిలోని జెడ్పీహెచ్ఎస్ అభివృద్ధికి జిల్లా పరిషత్ నుంచి నిధులు మంజూరైనట్లు జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ చెప్పారు. శనివారం అర్వపల్లిలోని జెడ్పీహెచ్ఎస్‌ను తనిఖీచేసి నూతనంగా పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా పరిషత్ నుంచి మంజూరైన రూ.3లక్షలతో పాఠశాలకు స్టేజీ నిర్మాణం, రూ.2లక్షలతో పాఠశాలకు నీటి సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి బాలునాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు భరోసా అమలుపై అభిప్రాయ సేకరణ



చివ్వెంల : మాట్లాడుతున్న డీసీఓ పద్మ

తుంగతుర్తి : 10 ఎకరాల భూమి కలిగిన రైతులందరికీ రైతు భరోసా అమలు చేయాలని కోరుతున్నట్లు డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు తెలిపారు. శనివారం రైతు సేవా సహకార సంఘంలో జిల్లా అధికారులు చేపట్టిన రైతుల అభిప్రాయ సేకరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సాగు చేసే రైతుల భూములకే రైతు భరోసా కల్పించాలని అన్నారు. వ్యవసాయానికి అనుకూలంగా లేని భూములను రైతు భరోసా నుంచి తొలగించాలని రైతులు కోరుతున్నట్లు తెలిపారు. కౌలు రైతులకు కూడా రైతు భరోసా కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా సేవ సహకార శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్ గజవెల్లి శ్రీనివాస్, జిల్లా సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ అశోక్, ఆడిటర్ రామచంద్రయ్య, ఏడీఏ జగ్గు నాయక్, ఏఓ బాలకృష్ణ, ఏఈఓలు మనోహర్, లక్ష్మీప్రసన్న, సృజన, సొసైటీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సొసైటీ డైరెక్టర్లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

చివ్వెంల : ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రాథమిక సహకార సంఘాల డీసీఓ పద్మ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం బ్యాంకులో నిర్వహించిన ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. రైతులకు అన్నిరకాల సేవలు అందిస్తున్నామని, వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. త్వరలో మీసేవ ద్వారా అన్ని రకాల సేవలు కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా రైతు భరోసా పథకంపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. సాగు చేసిన భూమి వరకు రైతు భరోసా ఇవ్వాలని రైతులు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎల్పీ క్రిష్ణ, ఏఓ ఆశాకుమారి, ఏఈఓలు పవన్, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

తిరుమలగిరి : ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం కార్యాలయంలో శనివారం రైతు భరోసా పథకంపై రైతుల నుంచి అభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడారు. రైతు భరోసా పథకాన్ని ఐదు ఎకరాల నుంచి పది ఎకరాల వరకు వర్తింపజేయాలని కోరారు. సాగు చేసే భూములకు మాత్రమే ఈ పథకాన్ని వర్తింపజేయాలని అన్నారు. పంటలు సాగు చేసే ముందే పెట్టుబడి సహాయాన్ని ఒకే విడతలో మంజూరు చేయాలని తెలిపారు. కౌలు రైతులకు రైతు భరోసా పథకాన్ని వర్తింపజేయాలని అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, ఏఈఓ వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, డైరెక్టర్లు అశోక్‌రెడ్డి, కిష్టు నాయక్, సిబ్బంది సర్వన్, మల్లేష్ పాల్గొన్నారు.

నేడు ప్రజాభిప్రాయ సేకరణ

అర్వపల్లి : రైతు భరోసా పథకం అమలుపై నేడు అర్వపల్లిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, సీఈఓ మేడెబోయిన రామస్వామి శనివారం తెలిపారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ఉమ్మడి మండల సంఘ సభ్యులు, రైతులు హాజరుకావాలని కోరారు.



తుంగతుర్తిలో మాట్లాడుతున్న డీసీసీబీ డైరెక్టర్



తిరుమలగిరి : మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్

అధిక ఫీజుల వసూళ్లను అరికట్టాలని వినతి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో అధిక ఫీజుల వసూళ్లను అరికట్టాలని కోరుతూ డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శనివారం కోదాడలో ఎంఈఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బోయిళ్ల నవీన్ మాట్లాడారు. ఇష్టానుసారంగా ఫీజులు పెంచి వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు కనీస వసతులు లేవని, ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా పుస్తకాలు, యూనిఫాం అమ్ముతున్నారని ఆరోపించారు. విద్యతో వ్యాపారం చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భావన ఆదినారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు అబ్బురాం, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

అనంతగిరి : గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీపీ చుండూరి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం అనంతగిరి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు నివేదికలు చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. అనంతగిరి నుంచి చనుపల్లి రోడ్డును డబుల్ లేన్‌గా మార్చేందుకు రూ.20 కోట్ల నిధులు, అమీనాబాద్ – నడిగూడెం రోడ్డుకు రూ.25 కోట్ల నిధులు మంజూరు కాగా పనులు టెండర్ల దశలో ఉన్నట్లు తెలిపారు. అమీనాబాద్ – ఈశ్వరమాదారం రోడ్డులోని హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. అనంతరం ఎంఈఓ సలీం షరీఫ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ ఏఈ కీర్తిరెడ్డి మాట్లాడుతూ.. అనంతగిరి నుంచి చనుపల్లికి ప్రత్యామ్నాయ 33 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఓవర్ లోడ్ ఉన్న గ్రామాల్లో ఆరు కొత్త ట్రాన్స్‌పార్మర్‌ల ఏర్పాటు, డ్యామేజ్ అయిన స్తంభాలను పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. ఎన్ఎస్పీ, ఇరిగేషన్ ఏఈలు కె.శ్రీనివాస్, కె.జీవన్‌కుమార్ మాట్లాడుతూ.. శాంతినగర్‌లోని ఉత్తమ్‌పద్మావతిరెడ్డి ఎత్తిపోతల పథకానికి రూ.5 కోట్ల 30 లక్షలు నిధులు మంజూరు కాగా పనులు టెండర్ దశలో ఉన్నట్లు తెలిపారు. కొత్తగూడెం మేజర్, పాలారం మేజర్, కొమరబండ మేజర్ కాలువలకు లైనింగ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కొణతం ఉమ, అధికారులు, ఎంపీటీసీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.